దసరా వేళ ధరల దడ



దసరా పండుగ వేళ నిత్యావసర ధరలు దడ పుట్టిస్తున్నాయి. కూరగాయల ధరలు పైపైకి చేరుతున్నాయి. మూడు పూటలా తిండి కూడా ఖరీదైన వస్తువుగా మారింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం అమాంతంగా పెంచడంతో నిత్యం వినియోగించే వంట నూనె ప్యాకెట్లపై రూ.15 నుంచి రూ.20 వరకు అదనంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

- అమాంతం పెరిగిన నిత్యావసర ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలపై పెను ప్రభావం
- ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం





అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

పుట్టపర్తి టౌన్: ప్రస్తుత అక్టోబర్ మాసంలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. దీనికి తోడు దసరా పండుగ తోడైంది. ఇలాంటి కీలక సమయంలో ధరలు పెరగడంతో సామాన్యుడికి ఇబ్బందికరంగా పరిణమించింది. క్యాటరింగ్ నిర్వాహకులు సైతం భోజనాల రేట్లు పెంచేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాటరింగ్ నిర్వహించే వారు ఇది వరకు ఒకరికి రూ.125 నుంచి రూ.130 వసూలు చేసేవారు. ఇప్పుడది ఏకంగా రూ.160 పెంచారు. కూరగాయలైతే ఏది కొనాలన్నా కిలో రూ.50 పైమాటే. ఆకుకూరలైతే రూ.20 ఇస్తే రెండు కట్టలు కూడా రాని పరిస్థితి. కంది పప్పు కిలో రూ.150 నుంచి రూ.185, పెసరపప్పు కిలో రూ.135 నుంచి రూ.150, మినపప్పు కిలో రూ.120 నుంచి రూ.135, ఉల్లి కిలో రూ.50 నుంచి రూ.65, అల్లం కిలో రూ.100 నుంచి రూ.130, వెల్లుల్లి కిలో రూ.320 నుంచి రూ.360, ఎండుమిర్చి కిలో రూ.280 నుంచి రూ.360, వంట నూనె లీటర్ రూ.110 నుంచి రూ.125 వరకు పెరిగాయి.

ధరల నియంత్రణలో విఫలం

సామాన్యుల నడ్డి విరుపస్తున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఎన్నికల సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతరంగా పెరిగిపోయాయని కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నిత్యావసర వస్తువుల ధరల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా సామాన్యులపై పెనుభారం మోపుతున్నారు. ఎక్కడ ప్రజలు తిరగబడతారో.. ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందోనని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. గతంలో 'బాదుడే బాదుడు' కార్యక్రమంలో ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇలా ఎన్నడూ చూడలేదు



ఒకే నెలలో నూనెలు, కూరగాయల ధరలు అమాంతంగా పెరిగి పోవడం గతంలో ఎప్పుడూ చూడలేదు. మాలాంటి పేదలు బతికేందుకు ప్రభుత్వం ఏమాత్రం అవకాశం కల్పించడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు ఈ విధంగా పెరుగుతూ పోతే సామాన్యుల గతి ఏం కావాలి? ధరల నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– గంగాద్రి బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి

పేదల ఇంట్లో పప్పు ఉడకదు



మార్కెట్‌లో ధరలు చూస్తే సామన్యుల గుండెల్లో దడ పుడుతోంది. బియ్యం, కూరగాయలు, నూనె ధరలు పెరిగిపోయాయి. కందిపప్పు ధర అధికంగా పెరిగిపోయింది. పేదల ఇంట్లో పప్పు ఉడకడం కష్టమే. నిత్యావసర ధరలు ఇలా ఉంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఏమి తిని బతకాలి?

– ప్రభావతమ్మ, కొత్తచెరువు

సామాన్యులపై భారం తగ్గించాలి



నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. దీంతో మధ్యతరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ధరలు నియంత్రించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. సామాన్యులపై భారం తగ్గించాలి.

– రామాంజనమ్మ, గోనేనాయక్ తండా, పుట్టపర్తి

ధరలకు కళ్లెం వేయాలి



నిత్యావసరాలతో పాటు బియ్యం, కూరగాయల ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నెలవారి ఖర్చు రూ.15 వేలకు మించుతోంది. పప్పు దినుసులైతే తినడం మానేశాం. కంది పప్పు కిలో రూ.170 నుంచి రూ.180 పలుకుతోంది. ఆవాలు, జీలకర్ర, సోంపు, తెల్లగడ్డల ధరలు రెట్టింపయ్యాయి. ధరలకు ప్రభుత్వం కళ్లెం వేయాలి. లేకుంటే సామాన్యుల మనుగడ అగమ్యగోచరమే.

– అనసూయమ్మ, పగడాలవారిపల్లి,ఓడీచెరువు మం

రాజరాజేశ్వరీ రక్షమాం!

సాక్షి బృందం: ధర్మవారం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సంబరంగా సాగుతున్నాయి. ఆదివారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధర్మవరం అర్బన్: రాజరాజేశ్వరిదేవి



ధర్మవరం అర్బన్: మధురమీనాక్షిదేవిగా



తలుపులలో వన విహారిణి అలంకారంలో



అమడగూరులో లలితా త్రిపుర సుందరిదేవిగా చౌడేశ్వరమ్మ



బుక్కపట్నం మండలం జానకంపల్లిలో అన్న పూర్ణదేవిగా దుర్గమ్మ



బత్తలపల్లి :పూజలందుకున్న లలితా త్రిపుర సుందరీదేవి



తాడిమర్రిలో లలితా త్రిపురసుందరిగా వాసవీమాత



నల్లచెరువు: లలితాదేవిగా వాసవీమాత



పుట్టపర్తిలో సంతాన లక్ష్మిగా రాజరాజేశ్వరి అమ్మవారు



కదిరి టౌన్: వారాహి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు



ముదిగుబ్బలో లలితాదేవి రూపంలో వాసవీమాత



కనగానపల్లి: మద్దెలచెరువులో పూజలందుకున్న మారెమ్మ దేవత

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా వదిలేసి

- ప్రారంభానికి నోచుకోని పశువైద్యశాల భవనం
- మూగజీవాలను అందని వైద్యం
- ప్రజాధనం వృథా



పశువైద్యశాల భవనం ఆవరణలో పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు

కనగానపల్లి: మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వైద్యశాల ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వంతో మూగజీవాలకు వైద్యం అందడం లేదు. ఈ భవనాలు వినియోగంలోని రాకనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రం కనగానపల్లిలో సుమారు రూ.23 లక్షలు వెచ్చించి పశువైద్యశాల భవనం నిర్మించారు. గ్రామానికి సమీపంలో రాంపురం రహదారి పక్కన ఈ భవనం ఉంది. ఈ భవనానికి చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు పశువైద్యశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. అయితే ఈ భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభించ లేదు. వైద్యశాల ఆవరణలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో పాటు భవనానికి ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలు, గోడలు కూడా దెబ్బతిన్నాయి. భవనమే శిథిలావస్థకు చేరుకుంటోంది. ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చి పశువైద్య సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తే కనగానపల్లితో పాటు చుట్టు పక్కల ఉన్న రాంపురం, వరిమడుగు, పాలవాయి గ్రామాల పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకుని రావాలని పశువైద్య సిబ్బంది కోరుతున్నారు.

వెంటనే ప్రారంభించాలి

పాడి రైతుల కోసం రూ.లక్షల వెచ్చించి నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో గ్రామం మధ్యలో ఉన్న పాత భవనం వద్దకే పశువులు, గొర్రెలను వైద్యం కోసం తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడ సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి కొత్త భవనాన్ని త్వరగా ప్రారంభించి రైతులకు ఉపయోగపడేలా చూడాల్సిన అవసరం ఉంది.

– సంగప్ప, రైతు, యలకుంట్ల, కనగానపల్లి మండలం

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌కు మాతృవియోగం



లింగమ్మ(ఫైల్)

బత్తలపల్లి: ధర్మవరం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, నల్లబోయనపల్లికి చెందిన గొల్లపల్లి రామకృష్ణారెడ్డి తల్లి గొల్లపల్లి లింగమ్మ(95) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రామకృష్ణారెడ్డి మార్కెట్ యార్డు చైర్మన్‌గానూ, చిన్నకుమారుడు నరసింహారెడ్డి సర్పంచుగా పని చేశారు. లింగమ్మ మృతి పట్ల బత్తలపల్లి ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అక్కిం నరసింహులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక



తగరకుంట జెడ్పీ పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

కనగానపల్లి: 20 సంవత్సరాల క్రితం అంతా కలసి చదువుకొన్న వారంతా మళ్లీ ఒకచోట కలుసుకుని అప్పటి మధురానుభూతులను నెమరువేసుకున్నారు. మండలంలోని తగరకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఆదివారం స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను పిలిచి ఘనంగా సన్మానించారు. అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయమందించాలని తీర్మానించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండటానికి అవసరమైన పాత్రల కోసం రూ.20 వేల సాయాన్ని స్కూల్ కమిటీ చైర్మన్ బ్రహ్మయ్యకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిరంజీవి, బసవ రెడ్డి, హేమ, అరుణ, రాజ్యలక్ష్మి, నవీన్, నల్లప్ప, పెద్దన్న, శ్రీనివాసులు, నాగార్జున, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ టైం డ్యూటీలతో ఇబ్బందులు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్టీసీ డిపోలో ఓవర్ టైం డ్యూటీల శాతం ఎక్కువగా ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీ నాగార్జున రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నరసింహులు, డిపో కార్యదర్శి ముస్తఫా పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏ ఆర్టీసీ డిపోలో లేని నిబంధనలు, ఓవర్ టైం డ్యూటీలు ధర్మవరం డిపోలో ఉన్నాయన్నారు. పలుమార్లు డిపో మేనేజర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించని పక్షంలో నిరవధిక ఆందోళనలు చేపడతామన్నారు. యూనియన్ సభ్యులు బాబు, తిరుమలేసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒడియరాజుల ఉద్యోగుల సంఘం కమిటీల ఎన్నిక



వడియరాజుల ఉద్యోగుల నూతన కమిటీ

కదిరి అర్బన్: ఎస్ఎంజీఎల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఒడియరాజుల ఉద్యోగుల సంఘం శ్రీసత్యసాయి జిల్లా, కదిరి డివిజన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా జేవీ రమణ,ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా క్రిష్టయ్య, గౌరవాధ్యక్షుడిగా అశ్వర్థప్ప, సలహాదారులుగా నారాయణ, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్,గంగాధర్‌ను ఎన్నియ్యారు. కదిరి డివిజన్ అధ్యక్షునిగా మురళీ, ప్రధాన కార్యదర్శిగా సోమశేఖర్, కోశాధికారిగా మునిస్వామి, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాములు, సలహాదారులుగా ఆదినారాయణ, రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఎర్ల రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, రమణ, వీరనారాయణ, వర్కింగ్ ప్రసిడెంట్‌గా గోపాల్‌లను ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు చంద్రశేఖర్, కుప్పయ్య పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో మునిరత్నం అనే వ్యక్తి షేక్ హుసేన్‌పీరాపై దాడి చేశాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప వివరాల మేరకు.. కాలనీకి చెందిన షేక్ హుసేన్‌పీరా చిల్లర అంగడి పెట్టుకుని జీవిస్తున్నాడు. అతని ఇంటి ముందు మునిరత్నం నివసిస్తున్నాడు. మునిరత్నం రోజూ మద్యం సేవిస్తూ గొడవ పడేవాడు. కాలనీలోని మహిళలను దూర్భాషలాడుతుండేవాడు. శనివారం రాత్రి హుసేన్‌పీరా కోడలు ఇంటి ముందు కూర్చుని ఉండగా మునిరత్నం ఆమెను దూర్భాషలాడాడు. దీంతో హుసేన్‌పీరా ఆడవాళ్లను దూర్భాషలాడటం సరికాదని మునిరత్నంకు సర్దిచెప్పేందుకు వెళ్లాడు. మునిరత్నం చేతిలో ఉన్న స్క్రూ డ్రైవ్‌తో తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు గమనించి వెంటనే హుసేన్‌పీరాను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ రెడ్డప్ప ఆసుపత్రికి వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హుసేన్‌పీరాను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కాలేజి సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దయ్యగుట్టకు చెందిన జయరాములు, నాగరాజుకు గాయాలయ్యాయి. వారిద్దరూ బైక్‌పై కళాజ్యోతి సర్కిల్ నుంచి సిద్దయ్యగుట్టకు వస్తుండగా కారు ఢీకొంది. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

త్వరలో శ్రీశైలానికి ఆర్టీసీ సర్వీసు



కదిరి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

కదిరి అర్బన్: త్వరలో శ్రీశైలానికి ఆర్టీసీ సర్వీసును నడుపుతామని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో జరిగిన డీఎం మైనోద్దీన్ కుమార్తె వివాహానికి ఆయన హాజరయ్యారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో శ్రీశైలానికి రాత్రిపూట కదిరి డిపో నుంచి సర్వీసు నడిపేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బస్టాండ్‌లో అదనపు కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎన్ఎంయూ నాయకులు కదిరి డిపో నుంచి పుట్టపర్తి, ధర్మవరం డిపోల్లో రిలీవ్ డ్యూటీపై పని చేస్తున్న సిబ్బందిని వెంటనే వాపసు పంపించాలని ప్రజారవాణా అధికారికి విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, ఎన్ఎంయూ నాయకులు ఎన్వీరమణ, హరిమోహన్, బైరిశెట్టి, రామచంద్ర, సురేంద్ర, కార్గో సూపర్ వైజర్ శ్రీనివాసులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తాం

పుట్టపర్తి: రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఫీచర్ల పేరుతో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగదారులపై భారం మోపితే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు అడపాల వేమనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని గగ్గోలు పెట్టిన కూటమి సర్కార్ ప్రస్తుతం ఆ దిశగా పావులు కదుపుతోందని తెలిపారు. టీడీపీ అనుకూల మీడియాలో ప్రజలకు మేలు జరిగేలా ప్రచారం చేయిస్తున్నారని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక ఎస్‌వీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సత్యసాయి జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అమడగూరు: పూలకుంటపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ శాంతమ్మ భర్త జగదీశ్వర్‌రెడ్డి(55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు డాక్టర్ కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని జగదీశ్వర్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఊర్లకు వెళ్లేవారు సమాచారం ఇవ్వండి



కరపత్రాలు విడుదల చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: కదిరి డివిజన్ పరిధిలో దసరా సందర్భంగా ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు పోలీసులు, చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శివ నారాయణస్వామి సూచించారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన సీఐ నారాయణరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇస్తే రాత్రిపూట నిఘా ఉంచుతామన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో ఉంచాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఓటీపీ నంబర్లు ఇతరులతో పంచుకోకూడదన్నారు. పార్సిల్‌లో డగ్స్, గంజాయి వచ్చిందని, దర్యాప్తులో సహకరించాలని ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థినులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఓంశ్రీ, ఫర్హానా

పుట్టపర్తి అర్బన్: త్వరలో గుంటూరు వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు జగరాజుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ అజీంబాషా తెలిపారు. అనంతపురం జూనియర్ కళాశాలలో అండర్–14 విభాగంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థినులు ఓంశ్రీ, ఫర్హానా ప్రతిభ కనబరిచడంతో నిర్వాహకులు వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. అక్కడా ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ముదిగుబ్బ: ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చకపోతే వాల్మీకులంతా ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నల్లచెరువు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం దామవాండ్లపల్లిలో అధికారులు వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఫారెస్ట్ బీట్ అధికారులు జేసీ వెంకటేశులు, ఆర్ హరిప్రసాద్. జి.అనిల్ కుమార్, వి.నాగరాజు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



విద్యార్థులకు కరాటే బెల్టులు అందిస్తున్న కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా, అతిథులు

ధర్మవరం: స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. మాంగళ్య శిల్క్స్ నిర్వాహకులు జింకా పురుషోత్తం, కదిరి సీనియర్ కరాటే మాస్టర్ అక్బర్ అలీ విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్ బెల్టులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకుని వారికి వారే రక్షించుకునే విధంగా శారీరక దృఢత్వం పెంచుకోవాలన్నారు. కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా పాల్గొన్నారు.

వర్సిటీ స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



పూజిత

ధర్మవరం అర్బన్: సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి చెస్ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి పూజిత ఎంపికైనట్లు బీఎస్‌కే చెస్ అకాడమి చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో ఐదు మ్యాచ్‌లకు గాను నాలుగింటిలో గెలిచి మూడోస్థానంతో నిలిచిందన్నారు. నవంబర్‌లో తమిళనాడు లా యూనివర్సిటీలో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీల్లో పూజిత పాల్గొంటుందన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

నల్లమాడ: రాగానిపల్లిలో నూతనంగా నిర్మించిన ఉమామహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం గణపతి ప్రార్థన, వేద పారాయణం, కలశ స్థాపన, ఆవరణ పూజలు, అధివాసములు, పలు హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.